అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 21 మార్చి 2023
పేజీలు : 04



మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

# ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే లోకేష్ పాదయాత్ర

-మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**పుట్టపర్తి టౌన్, మార్చి 20, ప్రభాతవార్త**

ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి, వైసిపి అరాచకపాలనపై ప్రజల్లో చైతన్యం నింపడానికే టిడిపిజాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేపడుతున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పల్లె మాట్లాడుతూ, కుప్పం నుండి ప్రారంభమైన ఈ పాదయాత్ర మంగళవారం పుట్టపర్తి నియోజకవర్గంలోని పునగంపల్లికి మధ్యాహ్నం 02:30 గంటలకు చేరుకుంటుదన్నారు. అక్కడ యువగళం పాదయాత్రకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున లోకేష్‌కు ద్విచక్రవాహనాలతో స్వాగతం పలుకుతారని,సాయంత్రం వణుకువారిపల్లి వరకు లోకేస్ పాదయాత్రలో తనతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొంటారన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని మూడు రోజుల పాటు విరామం ఉంటుందన్నారు. 25న తిరిగి వణుకువారిపల్లి నుండి పాదయాత్ర ఓడిసికి చేరుకుంటుందన్నారు. అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. బహిరంగ సభకు నియోజకవర్గంలోని ఆరుమండలాలనుండి వేలాది మంది పార్టీ శ్రేణులు అభిమానులు తరలిరానున్నారన్నారు. బహిరంగ సభకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, వైసిపిఅరాచక దౌర్జన్య, అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సన్నద్ధులౌతున్నారన్నారు. చిన్న వయస్సులోనే 400 రోజులు 4000 కిలోమీటర్ల పాదయాత్ర చరిత్రలో ఎవరూ చేసి ఉండరని ఆ ఘనత నారాలోకేష్‌కే దక్కుతుందన్నారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని పల్లె పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



## తిమ్మరాజును ఓదార్చిన ఉన్నం హనుమంతరాయ చౌదరి


నివాళులు అర్పిస్తున్న ఉన్నం హనుమంతరాయ చౌదరి

కళ్యాణదుర్గం టౌన్, మార్చి 20 ప్రభాతవార్త మున్సిపాలిటీ కేంద్రంలో 13వ వార్డు మాజీ కౌన్సిలర్ తిమ్మరాజు భార్య రామాంజినమ్మ గుండెపోటుతో స్వర్గస్తులయ్యారు. ఆమె భౌతిక కాయానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి గోపి, నాగప్ప, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారికి తీసుకుంటున్న భూములకు ప్రైవేటు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి


వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

చిలమత్తూరు, మార్చి 20 ప్రభాత వార్త : గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి తీసుకుంటున్న భూములకు ప్రైవేటు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపి అనంతరం డిప్యూటి తహాశీల్దార్ హనుమంతుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కోడూరు, చాగలేరు, శెట్టిపల్లి గ్రామ పొలాల పరిధిలో దాదాపు వంద మంది రైతుల నుండి వంద ఎకరాల భూములను జాతీయ రహదారి పేరుతో సేకరిస్తున్న భూములకు ప్రస్తుత భూమి ధరకు అదనంగా మూడింతలు ఇవ్వాలని పెరిగిన ధరలకు అనుగుణంగా చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని, గతంలోను చిలమత్తూరు మండలంలో ఆర్థిక మండలి పేరుతో వేల ఎకరాలు ఎపిఐఐసి తీసుకుందని, ఉన్న అరకొర భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ తరుణంలో నేషనల్ హైవే పేరుతో భూములు తీసుకుంటున్నారని భూమి వివిధ పేర్లతో రైతులకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేవలం వ్యవసాయం మాత్రమే తెలిసిన రైతుల భూములు కోల్పోయి ఇప్పటికే బ్రతికే ఆదరువు లేక ఇతర ప్రాంతాలకు వలసవెళ్లే దౌర్భాగ్యమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. కావునా 2013 భూసేకరణ చట్టం ప్రకారం మూడింతల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అలాగే భూమి కోల్పోయిన రైతులకు మరో చోట సాగుభూమిని ఇవ్వాలని భూమిని కోల్పోతున్న రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మినారాయణ, రమేష్, నరసింహ, రైతులు శ్రీనివాసురెడ్డి, ఆదినారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి, నారాయణప్ప, ఆచారి, సోము, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు - సిఐటియు


తహాశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

లేపాక్షి, మార్చి 20 ప్రభాతవార్త : అక్రమంగా సిఐటియు నాయకులు, అంగన్‌వాడివర్కర్లను అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో లేపాక్షి మండల తహాశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిన్నటి దినం అంగన్‌వాడివర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఛలో విజయవాడ కార్యక్రమం చేపడుతుంటే అంగన్‌వాడివర్కర్లు, సిఐటియు నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు నోటీసులు ఇస్తూ బెదిరిస్తూ మీపైన కేసులు పెడతామని ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పడం చాలా నీచమైన చర్యని ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చినటువంటి ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని కనీసవేతనం నెల్కుఉ 26 వేల రూపాయలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని అరెస్టులకు భయపడమని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## నోటీసులు జారీ


నోటీసులు అందజేస్తున్న జమేదార్ మల్లికార్జున

బెలుగుప్ప, మార్చి 20 ప్రభాతవార్త : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలీసులు ఆశావర్కర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ.. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని, నెంబర్1 జీవోను రద్దు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పించాలని సుప్రీం కోర్టు తీరు ప్రకారమే గ్రాంట్స్ ఇవ్వాలని సోమవారం ధర్నాకై వెళ్తున్న వారిని స్థానిక జమేదార్ మల్లికార్జున నోటీసులు జారీ చేశారు. ఈ అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లు.. వీరికి అంగన్‌వాడీ సెంటర్‌లో రిటైర్డ్ అయినప్పుడు 5 లక్షలు ఇవ్వాలని, వచ్చే జీతంలో పింఛన్ ఇవ్వాలని, ఆయా వర్కర్లను పర్మినెంట్ టీచర్లుగా తీసుకోవాలని, అంగన్‌వాడీ సెంటర్‌లో ఇంగ్లీష్ మీడియంను ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లను చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## 16వ విడత ప్రజావేదికలో రూ 33వేల 129 రికవరి రాసిన అధికారులు


ప్రజా వేదికలో వివరిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మార్చి 20 ప్రభాతవార్త, : 16వ విడత సామాజిక తనిఖీలో భాగంగా మండల వ్యాప్తంగా 16 పంచాయితీలలో 01-04-2021 నుండి 31-03-2022 వరకు జరిగిన జాతీయ ఉపాదిహామి పనులకుగాను సోషల్‌ఆడిట్‌టీం నిర్వహించిన సామాజిక తనికీ వివరాలను ప్రజా వేదికద్వారా తెలిపే కార్యక్రమంలో భాగంగా సోమవారం కళ్యాణదుర్గంలో ఏపీడి కార్యాలయంలో డివిఓ వైవి రమణారెడ్డి,ఫైనాన్స్‌మేనేజర్ జి వెంకట్‌నాయుడు,ఏపిడి రమేష్‌నాయక్,ఏఓ నంధకిషోర్ అధ్వర్యంలో సామాజిక తనికీలో జరిగిన అవకతవకలను డీర్‌పిలు,యస్‌అర్‌పీల సభకు వివరించి మండల వ్యాప్తంగా 12 పంచాయితీలలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు,టీఏలకు రూ 33వేల 129 రుపాయలు రికవరీ చేయాలని అదేశించిన అధికారులు మాట్లాడుతూ పేదప్రజలకు ఉపాదికల్పించే ఈ పథకంను ప్రజలకు అవసరపడేలా ప్రతి అధికారి చేయాలి అంతేకాని అవకతవకలకు తావివ్వకుండా ప్రతిరోజు గ్రామస్థాయిలో ప్రతిరోజు ఏపిఓ అప్పస్వామి,టెక్నికల్ అసిస్టెంట్ పర్యావేక్షించాలని తెలిపారు.

## ప్రతి ఒక్కరు నోటిశుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌బాబు

హిందూపురం టౌన్, మార్చి 20 ప్రభాతవార్త : నోటిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలని ప్రభుత్వాసుపత్రి దంతవైద్యులు డాక్టర్ విజయ్‌బాబు అన్నారు. సోమవారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాసుపత్రి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌బాబు మాట్లాడుతూ నోరు ఎంత ఆరోగ్యంగా వుంటే శరీర ఆరోగ్యం అంతబాగుంటుందని, నోరు, దంతాలు, చిగుళ్ళు, నాలుక మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని నోటిలో బ్యాక్టీరియా జీర్ణ, శ్వాసకోశనాళం ద్వారా లోనికి ప్రవేశించి ఇతర వ్యాధులు రావడానికి కారణమవుతుందని అందువల్ల నోటిశుభ్రత పాటిస్తే ఇతర రోగాలను అరికట్టవచ్చన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది నోటి వ్యాధితో బాధపడుతున్నట్లు డబ్ల్యుహెచ్ఓ నివేదికలు తెలుపుతున్నాయన్నారు. దీనికి కారణం పొగాకు, ఇతర చెడు అలవాట్లే కారణమన్నారు. అనంతరం నోటి ఆర్యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ఎమ్మెల్యేపై దాడి తగదు


నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

హిందూపురం, మార్చి 20 ప్రభాత వార్త : అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి పై దాడి చేయడం తగదని టిడిపి నాయకులు సోమవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడాన్ని జీర్ణించుకోలేని వైసిపి అసెంబ్లీలోనే దాడులకు దిగుతున్నారని, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా చట్టసభల్లోనే వైసిపి ఎమ్మెల్యేలు దాడులకు దిగడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అనిల్‌కుమార్, జెపికె రాము, చంద్రమోహన్, డిఇ రమేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

- జాయింట్ కలెక్టర్ టి.ఎస్.చేతన్


స్పందన అర్జీలను స్వీకరిస్తున్న సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్

పుట్టపర్తిరూరల్, మార్చి 20, ప్రభాతవార్త : స్పందన అర్జీలను ఎలాంటి వాయిదాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని శ్రీసత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంబందిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా సంయుక్త కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ కొండయ్య, ఆర్‌డిఓ భాగ్యరేఖ, వివిధ శాఖల అధికారులు జిల్లా నలు మలూల నుండి విచ్చేసిన ప్రజల నుండి 134 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ టి.ఎస్‌చేతన్ మాట్లాడుతూ, సకాలంలో అర్జీలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారిపై ఉందని, ప్రతి నిత్యం పెండింగ్‌లోఉన్న అర్జీలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు డివిజన్, మండల స్థాయి అధికారులతో మాట్లాడి స్పందన అర్జీలను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పిడి చంద్రమౌళి రెడ్డి, డ్వామా పిడి రామాంజినేయులు, పిఆర్ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిసిఓ కృష్ణానాయక్, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, ఆరోగ్యశ్రీ అధికారి ఎల్లప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్పందనకు 36 అర్జీలు


బాధితురాలి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి,మార్చి 20, ప్రభాతవార్త : శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 36 ఫిర్యాదులు అందజేశారు. సోమవారం జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యలపై బాధితులు ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్‌కు బాధితులకు తమతమ సమస్యలను విన్నవించి నేరుగా ఫిర్యాదులు అందించారు. కొందరితో తమకు ప్రాణహాని ఉందని, తమపై ప్రత్యర్థులు దాడులుచేశారని, కుటుంబకలహాలు, భర్త,అత్తారింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు, బూమి వివాదాలు, రస్తా వివాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ వేధింపులు, వంటి పలు సమస్యలను విన్నవించి న్యాయంచేయాలని విన్నవించుకున్నారు. న్యాయ స్థానాల్లో ఉన్న విషయాల పట్ల కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని ఆదేశించారు. పోలీస్ పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కారం తెలిపారు. స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి రామకృష్ణప్రసాద్, డిసిఆర్‌బి ఎస్ఐ హారూన్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్నేషనల్ డే ఆఫ్ హ్యాపినెస్

-జీవితంలో సంతోషంగా ఉండటం ఎలా అనే అంశంపై సెమినార్


అవగాహన కల్పిస్తున్న ట్రిపుల్ యియియి విభాగాధిపతి వై.సురేష్‌బాబు


హాజరైన విద్యార్థులు

ఉరవకొండ, మార్చి 20 ప్రభాతవార్త : మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ హ్యాపినెస్' సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీ అధ్యక్షతన ట్రిపుల్ యియియి విభాగాధిపతి వై.సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో 'జీవితంలో సంతోషంగా ఉండడము ఎలా?' అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీ మాట్లాడుతూ ఏ.ఐ.సి.టి.ఇ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం బి మైండ్ ఫుల్, బి గ్రాట్‌ఫుల్, బి కైండ్ అని వివరించారు. చేస్తున్న పనిపై శ్రద్ధాభావం, కృతజ్ఞతాభావం, దయతత్వం దాని అర్థమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ యియియి అధ్యాపకులు బి.చంద్రమోహన్, ఏపీపీఎస్‌డీసీ కార్యక్రమ శిక్షకులె జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగిన అంగన్‌వాడీలు


కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు దృశ్యం

**పుట్టపర్తిటౌన్,మార్చి 20, ప్రభాతవార్త :** నిర్బంధాలతో అణచివేతతో ఉద్యమాలను ఆపలేరని అంగన్‌వాడీ పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం యూనియన్ ఉపాధ్యక్షురాలు ఉషారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.ఎస్.వెంకటేష్, శ్రామిక మహిళా కార్యదర్శి దిల్షాద్ మాట్లాడుతూ, మార్చి 20న విజయవాడలో జరగనున్న మహాధర్నాకు పోనివ్వకుండా ఎక్కడికక్కడ అంగన్‌వాడీ మహిళలను పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం పోలీసుల ద్వారానిర్భంధించడం అన్యాయమన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మహాధర్నాకు వెళ్ళకుండా మహిళలని చూడకుండా ఇళ్ళకు వెళ్ళి అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం కన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామనిముఖ్యమంత్రి ప్రకటించిన హామీ ఏమైందన్నారు. అరెస్ట్ చేసిన మహిళలను వెంటనే విడుదల చేయాలని, డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పుమేరకు కనీస వేతనాలు ఇవ్వాలని ఫేస్‌యాప్ విధానం రద్దు చేయాలని, జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని పదవి విరమణ బెనిఫిట్స్ అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను సచివాలయాల పర్యవేక్షణ తీసుకువచ్చే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అనేక రకాల సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలు సహాయకుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఓ భాగ్యరేఖకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్ళు శిరీష, సుశీలమ్మ, మణెమ్మ, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి గేట్స్‌కు ప్రతిష్టాత్మక అవార్డు


గేట్స్ అధినేత అవార్డు అందుకుంటున్న దృశ్యం

గుత్తి, మార్చి 20 ప్రభాతవార్త : పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యారంగంతో పాటు సమాజాభివృద్ధిలో చేస్తున్న కృషికి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అవార్డు దక్కింది. ఢిల్లీలోని ఇండియా ఇంటర్‌నేషనల్ కేంద్రంలో మానవహక్కుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందచేశారు. బెస్ట్ పర్‌ఫార్మర్ ఆఫ్‌దఇయర్ అవార్డును సంబంధిత అధికారుల చేత గేట్స్ అధినేత రఘునాథరెడ్డి, డైరెక్టర్ వాణిలు అందుకున్నారు. కళాశాలకు అవార్డు కావడం పట్ల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు తగవు

- యూటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న


యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు బూతన్న

మడకశిర టౌన్, మార్చి 20 ప్రభాతవార్త : మడకశిర తాలూకాలోని వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, యుటిఎఫ్ కామ్రేడ్స్ సమావేశమై ఇటీవల నూతనంగా శ్రీ సత్యసాయిజిల్లా యుటిఎఫ్ ఎన్నికల్లో మా ప్రాంతానికి చెందిన భూతన్నను యుటిఎఫ్ సత్యసాయి పుట్టపర్తి జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు అభినందించడం జరనిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు భూతన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం సకాలంలో పాఠ్య పుస్తకాలు, బూట్లు, జెవికె కిడ్స్, వర్క్‌బుక్స్ అందించక ఆ పాపాన్ని ఉపాధ్యాయులపై నెట్టి ఉపాధ్యాయులను బలి పశువులు చేస్తున్నారన్నారు. కనుక ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దు చేయాలని, పిఆర్‌సి అరియర్స్ వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకశిర మండల యూటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, ముద్ద గిరియప్ప, ఉపాధ్యక్షులు జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షులు, నరసింహప్ప, శివనాయక్, ఈశ్వర్ నరసింహమూర్తి, నంజప్ప, సూర్యప్రకాష్, హనుమంతరాయ్, హనుమంతరాయ, ఓబన్న, మహంతేష్, వెంకటనాయక్, ఉగ్ర నరసింహ, రంగనాథ్ పాల్గొన్నారు.

## సత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికుల సంఘీవంగా మాజీ ఎమ్మెల్యే ఉన్నం


కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న ఉన్నం హనుమంతరా చౌదరి, మారుతి చౌదరి

కళ్యాణదుర్గం టౌన్, మార్చి 20 ప్రభాతవార్త జిల్లాలో తాగు నీటి వసతి అందించే శ్రీ సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగు నీటి పథకాల్లో పని చేసే కార్మికులకు వేతనాలు అందంక నాలుగు రోజులుగా నిరవధిక సమ్మకు దిగిన కార్మికుల టీడీపీ నేత రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరా చౌదరి కుమారుడు ఉన్నం మారుతి చౌదరి సంఘీభావం తెలిపి వారితోపాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు ఆర్‌జి శివశంకర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌పాపంపల్లి రామాంజినేయులు, టిడిపి మండల కన్వీనర్ గొల్ల వెంకటేషులు,పట్టణ కన్వీనర్ శర్మాస్, కంబదూరు మాజీ సర్పంచు శ్రీరాములు, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, అక్కమ్మ గార్ల మాజీ ఆలయ కమిటీచైర్మన్ గొర్ల గోవిందప్ప, మాజీ సర్పంచు మానుకొండ్ల వెంకటేషులు, మల్లేపల్లి నారాయణ, గడ్డం రామాంజినేయులు, పాలబండ్ల రామన్న, శామీర్, ఇటుకల రామాంజినేయులు, మునీర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఆంధ్రప్రదేశ్

-గొట్కూరులో నూతన సచివాలయం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, మార్చి 20 ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కూడేరు మండలం గొట్కూరు గ్రామంలో నూతనంగా నిర్మించి గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లను ఆయన గ్రామ సర్పంచ్ ఆశలత, ఎంపీపీ నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేయడానికి వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవా, నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, హనుమంతరెడ్డి, మదన్మోహన్‌రెడ్డి, గంగాధర్, దేవేంద్ర, రంగారెడ్డి, రాజశేఖర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 5న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

-జీపుజాత కార్యక్రమంలో పిలుపునిచ్చిన రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు


ఉరవకొండకు చేరిన జీపుజాతలో పాల్గొన్న నాయకులు

ఉరవకొండ, మార్చి 20 ప్రభాతవార్త : కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించాలన్న నినాదంతో ప్రజానుకూల విధానాల సాధన కోసం దేశ రాజధాని ఢిల్లీలో ఏప్రిల్ 5న నిర్వహించతల పెట్టిన ప్రదర్శనలో కార్మిక, కర్షకులు పెద్దఎత్తున పాల్గొనాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, సహాయ కార్యదర్శి మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, డీవైఎఫ్ఐ నాయకులు నరసింహారెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగభూషణ పిలుపునిచ్చారు. ప్రదర్శన విజయవంతం కోరుతూ ఈనెల 19వ తేదీ నుండి జిల్లాలో చేపట్టిన జీపుజాత సోమవారం సాయంత్రం ఉరవకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా క్లాక్‌టవర్ కూడలిలో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగం ప్రసాదించిన కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని తన ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురు తిరగకుండా చూసుకోవడానికి మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగానూ, ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచిపెట్టేవిధంగా ఉందని విమర్శించారు. అందరికీ కనీస వేతనం నెలకు 26వేలు, కనీస పెన్షన్ 10వేలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైమ్‌స్కేల్, స్కీమ్ వర్కర్లు, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగుల, కార్మికుల రెగ్యులరైజేషన్, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ పురరుద్ధరణ చేయాలన్నారు. స్వామినాధన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం (సీ2 ప్లస్ 50శాతం) ఫార్ములా ఆధారంగా పంటలు అన్నింటికీ కనీస మద్దతుధర, పంటల సేకరణకు గ్యారెంటీ చేస్తూ చట్టం చేయాలన్నారు. పేద, మధ్య తరగతి రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని, వీరికి 60 సంవత్సరాల తరువాత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ వ్యవసాయ కార్మికుల ఉపాధికి రక్షణ, కనీస వేతనం రూ.600లపై 200 రోజులకు ఉపాధిహామీ పనులు పెంచాలని, బకాయి వేతనాలు చెల్లించి జాతీయ పట్టణ ఉపాధి గ్యారంటీ చట్టం చేయాలన్నారు. కాగా వజ్రకరూరులో జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి విరుపాక్షి, రైతు సంఘం తాలుకా నాయకులు జ్ఞానమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

## చర్చలు సఫలం..సమ్మె విరమించిన శ్రీ సత్యసాయి కార్మికులు

- పీఏబీఆర్‌లో పంపులను ఆన్ చేసిన కార్మికులు


పీఏబీఆర్‌లో పోలీసుల సమక్షంలో పంపులను ఆన్ చేస్తున్న కార్మికుల దృశ్యం

ఉరవకొండ, మార్చి 20 ప్రభాతవార్త : నవంబర్‌లో జరిగిన ఒప్పందం అమలు చేయాలని, వివిధ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 17వ తేదీ నుండి చేపట్టిన సమ్మెను శ్రీ సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు సోమవారం విరమించారు. పీఏబీఆర్ డ్యాంలో సీఐటీయు జిల్లా నాయకుడు నాగేంద్ర ఉరవకొండ సీఐ శేఖర్, కూడేరు ఎస్ఐ సత్యనారాయణల సమక్షంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామారావు, ఏఈఈ భార్గవ్‌తో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఈక్రమంలోనే అధికారులు, పోలీసుల సమక్షంలో కార్మికులు సాయంత్రం 5 గంటలకు డ్యాంప్ ప్రధాన పంప్‌హౌస్‌లోని పంపులను ఆన్‌చేసి నీటి పంపింగ్ ప్రారంభించారు. అధికారుల చర్చల్లో కార్మిక సంఘం నాయకులు ఆత్మకూరు శ్రీరాములు, కళ్యాణదుర్గం తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆమిద్యాల, రాకెట్ల, రాయంపల్లి పాఠశాలల్లో 'ఓరల్ హెల్త్ డే'

- ఆరోగ్య సూత్రాలు బోధించిన డాక్టర్ పావని, డాక్టర్ వెంకటేష్‌నాయక్
- విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి డెంటిస్ట్ డాక్టర్ రాజేశ్వరి


విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ, మార్చి 20 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆమిద్యాల, రాకెట్ల, రాయంపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో సోమవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఓరల్ హెల్త్ డే (ప్రపంచ నోటి ఆరోగ్య దినం) జరిగింది. డాక్టర్‌పావని, డాక్టర్‌వెంకటేష్‌నాయక్ నోటిఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించగా ఉరవకొండ ఆసుపత్రి దంత వైద్యురాలు డాక్టర్ రాజేశ్వరి విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరి నోరైతే ఆరోగ్యంగా ఉంటుందో వారి ఆరోగ్యం బాగుంటుందన్నారు. పళ్ళు గారపట్టడం, పుచ్చిపోవడం, రాలిపోవడంతో లాంటి వాటివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. ఆహార పదార్థాలను నమిలే సమయంలో నొప్పి పుట్టడం, సరిగా నమలకపోవడం వల్ల అజీర్తి, కడుపు నొప్పితోపాటు అనీమియా లాంటి రక్తహీనత సమస్యలు వస్తాయన్నారు. పెద్దవారు పొగాకు, గుట్కా నమలడం, మద్యపానం వంటి వాటివల్ల వంటి సమస్యలతోపాటు నోటి క్యాన్సర్, అనారోగ్యం ఏర్పడుతుందని, స్వీట్లు, శీతల పానీయాలు వినియోగంవల్ల పళ్ళు గారపట్టడం, పుచ్చి పోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.యండి.షఫీ, సచివాలయ ఏఎన్ఎంలు కోమల, చాముండేశ్వరి, సీఓ భగవాన్‌దాస్, ప్రధానోపాధ్యాయులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు కృషి


నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి, మార్చి 20 ప్రభాతవార్త : గుత్తి మున్సిపల్ పరిధిలో రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నూర్‌బీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక 22, 23బ్లాకుల పరిధిలో నూతన తాగునీటి పథకాలను ఆమె ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన చోట్ల నూతన బోర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటిసరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ శరత్‌చంద్ర, డిఇ ఇంతియాజ్‌అలి, కౌన్సిలర్ సులోచన, పట్టణ బూత్ కన్వీనర్ రంగస్వామి, వైకాపా యువనాయకులు షఫి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

03ATP20_03ATP20.qxd 20-03-2023 PM 10:24 Page 1



# స్త్రీల విద్య కోసం పాఠశాలను నెలకొల్పిన మహోన్నతుడు పూలే

పామిడి, మార్చి 20 ప్రభాతవార్త

స్త్రీలకు విద్యనందించాలన్న లక్ష్యంతో పాఠశాలలను నెలకొల్పిన మహోన్నతుడు మహాత్మజ్యోతిరావుపూలే అంటూ అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టకిందపల్లి రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబుళేసు కొనియాడారు. సంఘసంస్కర్త, బడుగు, బలహీన వర్గీల ఆశాజ్యోతి మహాత్మజ్యోతిరావుపూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాలతో సోమవారం పట్టణంలో ర్యాలీ చేపట్టిన బిసి, దళిత, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రక్కన నెలకొల్పిన మహాత్మజ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద వారి చిత్రపటా లకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఏర్పా టైన సభలో వారు మాట్లాడుతూ స్త్రీలకు విద్యాభ్యాసం కోసం తన బార్య సావిత్రి బాయిపూలేకి విద్యనందించిన మహాత్మాజ్యోతీరావుపూలే తదనంతరం పాఠశాలలను నెలకొల్పి ఆమె ద్వార అందరికీ విద్యాబోధన చేయించాడని తెలిపారు. ఒక జాతి మరొక జాతిపై పెత్తనం కొనసాగిస్తున్నంత కాలం ఈసమాజం బాగుపడదని ఉద్బోదించిన మహానుభావుడని తెలియజే శారు. రిజర్వేషన్లకై బ్రిటీష్ వారితో పోరాటం చేసిన మహాత్మాజ్యోతీరావుపూలే ఆలోచనా విధానంతో ఏకీభవించిన కొల్హాపూర్ సంస్థానాదీశుడు చత్రపతి సాహూజీ మహారాజ్ 1902లో అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్లను ప్రవేశపెట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరిగిందన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటువడుతూ స్త్రీల విద్యాబోధనకు పాఠశాలలను స్థాపించిన మహ త్మాజ్యో తీరావుపూలే ఆశయ సాధనకు కృషి చేస్తూనే ఇక్కడ ఆయన విగ్రహాన్ని సైతం ప్రతిష్ట చేస్తామని ప్రతినబూనారు. ఈకార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు ఓబుళేసు, మహాత్మాజ్యోతీరావుపూలే ఆశయ సాధన సమితి అద్యక్షులు పెద్దయ్య, దళిత నాయకులు తూర్పింటి మల్లిఖార్జున, వైసీపీ నాయకులు మునగల రంగనాయకులు, అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పిస్తున్న దృశ్యం.

## పోగొట్టుకున్న ఫోన్లు నేరుగా ఇంటికి

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

పోగొట్టుకున్న ఫోన్లు రికవరీ చేసి ప్రొఫెషనల్ కొరియర్ ద్వారా బాధితుల ఇళ్లకు అనంతపురం జిల్లా పోలీసులు ఉచితంగా చేర్చుతున్నారు. ఇక దొరకదు అనుకుని నిరాశతో ఉంటున్న సుదూర ప్రాంతాల ప్రజల ఇళ్ల వద్దకే ఫోన్లు ముట్టజెప్పుతుండటంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**సత్ఫలితాలిస్తున్న ఉచిత డోర్ డెలివరీ :** ఇప్పటి వరకు ప్రొఫషనల్ కొరియర్ సహకారంతో ఇతర రాష్ట్రాలు/ ప్రాంతాల ప్రజలకు ఉచిత డోర్ డెలివరీ ద్వారా 86 మొబైల్ ఫోన్లు అందజేశారు. జిల్లా పోలీసు చాట్ బాట్ సేవలు ప్రవేశ పెట్టినప్పటిన ఉంచి రికవరీ చేసి 5,737 ఫోన్లు అందజేశ్యారు. జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి సత్సంకల్పంతో అమలు చేస్తున్న చాట్ బాట్ సేవలు, ప్రొఫెషనల్‌కొరియర్ ద్వారా ఉచితంగా డోర్ డెలివరీ సేవల పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

**చాలా సంతోషంగా ఉంది : దాసరి సుష్మ :** అనంతపురం జిల్లా పోలీసులు ప్రొఫెషనల్ కొరియర్ ద్వారా తాను పోగొట్టుకున్న ఫోన్‌ను ఉచితంగా ఇంటికి చేర్చడంతో మా అందరికీ చాలా సంతోషంగా ఉందని బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పేరలి గ్రామ వాసి దాసరి సుష్మ చెప్పడం జరిగింది.

## ట్యాబులను నిత్యం వినియోగించేలా పర్యవేక్షించండి - హెచ్‌ఎంఓ టీచర్లకు డీఈఓ ఆదేశం

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబులు అందుకున్న ప్రతి విద్యార్థి విధిగా ప్రతిరోజు తనకి ఇచ్చిన ట్యాబును పాఠశాలకు తీసుకురావాలని, విద్యార్థి ట్యాబ్‌లో బైజూస్ కంటెంట్ కాకుండా ఇంకా ఏవైనా డౌన్‌లోడ్ చేసుకు న్నారా.. అన్న విషయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం సోమవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబును విద్యార్థి రెగ్యులర్‌గా ఉపయోగించే విధంగా, అందులో టెస్టులు అటెంప్ట్ చేసేటట్లు చూడాలన్నారు. ఏ పాఠశాలలోని విద్యార్థుల యొక్క ట్యాబుల వినియోగంపై పర్యవే క్షణ సరిగా లేదని గుర్తించినట్లైతే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబ ంధిత ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## నేటి నుంచి విద్యార్థులకు రాగిజావ - అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా విద్యార్థులకు వారంలో 3 రోజులు అల్పాహారంగా రాగిజావ అందించు కార్యక్రమం ఈ నెల 23న ప్రారంభించనున్నట్లు అనంతపురం జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.సాయిరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా ర్థులు రాగిజావ తాగడానికి అవసరమగు గ్లాసులు ప్రభుత్వముచే సరఫరా చేయుటకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వం గ్లాసులు సరఫరా చేయు పథకం అంటే ఈ విద్యా సంవత్సరం చివరి వరకు రాగిజావ అందించు మంగళ, గురు, శనివారం రోజుల్లో పిల్లలు వారి ఇంటి నుంచి గ్లాసులు తీసుకుని రావా ల్సిందిగా ప్రధానోపాధ్యాయులు/ఉపాధ్యాయులు తెలియజేసి పిల్లలకు అవగాహన కల్పించి ప్రతి విద్యార్థి తప్పకుండా రాగిజావ తాగే విధంగా పర్యవేక్షించాలని డీఈఓ ఆదేశించారు.

## 81 పిటీషన్లను స్వీకరించిన ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 20 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ డా.పక్కీరప్ప కాగినెల్లి నిర్వహించిన స్పందన కార్యక్రమ ంలో 81 పిటీషన్లు స్వీకరించా రు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలు తమ బాధలు, సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకుని పిటీషన్లు అందజేశారు. ప్రతి పిటీషనర్‌తో జిల్లాఎస్పీ ముఖాముఖి మాట్లా డారు. భూత గాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేదింపులు, చిన్న చిన్న రస్తా వివాదాలు తదితర సమస్యలను విన్నవించారు. చట్టపరిధిలో సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంబం ధిత పోలసీఉ అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.



పిటీషనర్ల సమస్యలు వింటున్న ఎస్పీ

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా సరస్వతి పూజ

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

అనంతపురం ఆర్టిసి బస్టాండ్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపాల్ సర్వీన్ ఆధ్వర్యంలో సరస్వతి పూజ కార్యక్రమాలు జరిగాయి. ఇందుకు ముఖ్య అతిథిగా ఏజిఎం సుబ్బారెడ్డి విచ్చేశారు. పాఠశాల గుమ్మం నుంచి లోపలికి ప్రవేశించిన మొదటి పూజ వేదిక వరకు తోరణాలతో అందంగా అలంకరించారు. పూజా వేదిక దగ్గర వేద పురోహితులు వేదమంత్రాలతో దీప దూప నైవేద్యాలతో సాంబ్రాణి పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించి పాఠశాల కోవెలను తలపించింది. ఆ సమయంలో అక్కడున్న వారంతా ఎంతో నిష్ఠతో, శ్రద్ధతో, త్రికరణ శుద్దితో పూజా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.



సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## వీర మంగళకు డాక్టరేట్

ఎస్కేయూ, మార్చి 20 ప్రభాతవార్త

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్ బి.అనిత పర్యవేక్షణలో, ప్రొ.వి.శ్రీకాంత్ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపిఇ), హైదరాబాద్, తెలంగాణ ఉప పర్యవేక్షణలో ఇంపార్ట్ ఆఫ్ ప్యాకే జింగ్ ఆన్ బిల్డింగ్ ఎ బ్రాండ్ ఇమేజ్-యాన్ ఎంపెరికల్ స్టడీ ఆఫ్ ఎఫ్‌య మ్‌సిజి ఇన్ సెలెక్టెడ్ సిటీస్ ఆఫ్ కర్ణాటక (అప్లికేషన్ ఆఫ్ క్యాఫరర్స్ బ్రాండ్ ఐడెంటిటీ ప్రిసమ్) అనే అంశంపై పరిశోధన చేసిన ఐపిఇ- ఐసియస్‌యస్‌ఆర్ ఫెలోషిప్ గ్రహీత యస్ .వీరమంగళకు యస్‌కెయు డాక్టరేట్ ప్రధానం చేసింది. తన పరిశోధన సమయంలోనే పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.



యస్.వీరమంగళ

## ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ మంత్రి దృష్టికి

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి ప్రోగ్రెస్సివ్ రికాగ్నైస్డ్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒక ప్రకటన ద్వారా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. బదిలీలు, పదోన్నతులు, హేతుబద్దీకరణ జిఓలపై అనేక అంశాలు హైకోర్టు పరిధిలో ఉన్న దృష్ట్యా గత జిఓలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## 'పది'లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు

పామిడి, మార్చి 20 ప్రభాతవార్త

'పది' పరీక్షల్లో మంచి ఫలితాను సాధించే విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేయటం జరుగుతుందని ప్రభుత్వ టిసి ఉన్నత పాఠశాల 1990-91 10వ తరగతి విద్యనభ్యశించిన పూర్వవిద్యా ర్థులు పేర్కొన్నారు. ఈమేరకు ప్రభుత్వ టిసి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను సోమవారం కలిసిన పూర్వవిద్యార్థులు ప్రోత్సాహక బహుమతుల విషయమై చర్చించారు. 'పది'లో మంచి ఉత్తీర్ణత సాధించే విద్యార్థినీ విద్యార్థులకు మొదటి బహుమతి రూ.5000, రెండవ బహుమతి రూ.3000, మూడవ బహుమతి 2000, ఇదేక్రమంలో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థికి రూ.2116 అందజేస్తామన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకెళ్తున్న సమాజంలో విద్యలో రానిస్తేనే భవిష్యత్తు ఉంటుందని అందువల్ల విద్యార్థులంతా ఒక ఉన్నతమైన లక్ష్యంతో విద్యనభ్యశించటం ద్వార మంచి ఫలితాలను సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆధిశగా ముందుకు సాగాలని పూర్వవిద్యార్థులు కోరారు.

## పంట నష్ట జాబితాను రెండు రోజుల్లో సమర్పించండి జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

బుక్కరాయసముద్రం, మార్చి 20 ప్రభాతవార్త

వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రెండు రోజుల్లోపు పంట నష్ట జాబితాను సమర్పించాలని జిల్లా వ్యవసాయాదికారి చంద్రనాయక్ అదికారులను ఆదేశించారు. సోమవారం బుక్కరాయసముద్రం మండలం లోని రేగడి కొత్తూరు, పొడరాళ్ళ గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. నష్ట పరిహారాన్ని 33 కాలం యొక్క ఫార్మాట్‌లో పొందపరచాలన్నారు.అవస రమైతే ఇతర గ్రామాల యొక్క గ్రామ వ్యవసాయ సహాయ కులను పంట దెబ్బతిన్న పంట పోలాల ను పరిశీలించి రెండురోజుల్లో నివేదికలను తయారు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాదికారి శ్యామ్ సుంద ర్‌రెడ్డి, గ్రామ సర్పంచు ఎర్రిస్వామి, శ్రీనివాసులు, వాలంటరీ లు,రైతులు తదితిరులు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాదికారి చంద్రనాయక్

## గొర్రెల కాపర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి

బుక్కరాయసముద్రం, మార్చి 20 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండలం చెదుళ్ళ గ్రామానికి చెందిన గొర్రెలకాపర్లు మేతల కోసం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాలలో గొర్రెలను మేపుకొను చుండగా రెండు రోజుల క్రితం అకాల వర్షాల వడగండ్ల వర్షానికి 350 గొర్రెలు చనిపోయి నవి.విష యం తెలుసుకున్న శింగనమల ఎమ్మె ల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభు త్వ విద్యా సలహాదారులు ఆలూరి సాంబశివారెడ్డి ఆదేశాలమేరకు అనంతపురం జిల్లా గొర్రెల పెంపకదారుల సంఘం అధ్యక్షులు పసుపుల నర్సింహయ్యగౌడ్, బుక్కరాయసముద్రం ఎంపి పి సునీత భర్త బుల్లే నారాయణస్వామి,గొర్రెలు చనిపోయిన సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన విషయాన్ని ఉయ్యాలవాడ తహశీల్దారుకి,పశువర్ధకశాఖ ఎడికి వివరించడం జరిగిందన్నారు.వారి సమక్షంలోనే గొర్రెలకు పంచనామ నిర్వహించి జరిగిన సంఘటన పై ప్రభుత్వనికి నివేదిక పంపించడం జరుగుతుందన్నారు.అనంతరం మిగిలిన గొర్రెలకు మందులను పంపిణీచేశారు.ఎమ్మెల్యే పద్మావతి,ఆలూరి సాంబశివారెడ్డి గొర్రెల కాపర్లకు ఆర్థిక సహాయం అందేలా చేస్తానని హామి ఇచ్చారు. ఒకే సారి 350 గొర్రెలు మృత్యువాత పడడంతో కాపరర్లు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుచున్నారు.



గొర్రెల కాపర్లను పరామర్శిస్తున్న గొర్రెల సంఘం నాయకులు

## పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం - జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

శింగనమల, మార్చి 20 ప్రభాతవార్త

అకాల వర్షాలకు మండల వ్యాప్తంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం వచ్చేలా వ్యవసాయ అధికారి ప్రతి రైతు వివరాలు నమోదు చేయా లని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం మండల పరిధిలోని సోదనపల్లి, ఆకులేడు, శివపురం, శింగనమల, గ్రామాల్లో అకాల వర్షాలు, వడగండ్లకు దెబ్బతిన్న వరిపంట మొక్క జొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ.. పంట నష్టపోయిన ప్రతిరైతుకు పంట నష్ట పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామని, నివేదిక తయారు చేసి మూడు రోజుల్లో నివేదిక పంపుతామన్నారు. ఆయన వెంట సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి చిన్నమ్మ, ఏఈఓ అక్కమ్మ, విహెచ్ఎ రైతులు పాల్గొన్నారు.



వర్షానికి దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న దృశ్యం

## ఈ నెల 25న ప్రముఖులరాక.. సమావేశం ఏర్పాటు చేసిన జిల్లా జడ్జి

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఎగ్జిక్యూటివ్ చైర్మన్, జడ్జి డి. రమేష్, హైకోర్టు న్యాయమూర్తి ఏ.వి.శేష సాయి, ఎం.గంగారావు, బి.శ్యాం సుందర్‌లు ఈ నెల 25న జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా జడ్జి శ్రీనివాస్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఉన్నతాధికారులు, న్యాయశాఖ అధికారులతో సమావేశమయ్యారు. రాయదుర్గంలో నిర్వహించు మహిళా న్యాయ అవగాహన కార్యక్రమంలో జడ్జిలు పాల్గొనడా నికి తగు ఏర్పాట్లుపై సమీక్షించారు. ఈ సమావేశంలో శ్రీ సత్యసాయిజిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, జిల్లా ఎస్పీ పక్కీరప్ప, సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్‌దే వ్ సింగ్, డిఎల్ఎస్ఎ కార్యదర్శి దీనబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

## 2003 డిఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింప చేయాలి - అపుస్

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

2003 డిఎస్సీ నోటిఫికేషన్ వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అపుస్ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ 57 మెమో ద్వారా సిపిఎస్ అమలు తేదికి ముందు వెలువడిన నోటిఫికేషన్‌ల ద్వారా నియామకమైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానమును వర్తింప చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వాలకు సడలింపు ఇచ్చింది. కావున పాత పెన్షన్ విధానం అమలు దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రదాన కార్యదర్శి ఎర్రిస్వామి సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

# వడగండ్ల వానతో కుదేలైన రైతన్నలు..

## -పుట్లూరు మండలంలో 20 కోట్ల నష్టం - శింగనమలలో 15 వందల ఎకరాల్లో నేలకొరిగిన వరిపంట - ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం, మార్చి 20 ప్రభాతవార్త బ్యూరో

ఈ నెల 18న కురిసిన వడగండ్ల వానతో శింగనమల నియోజకవర్గం రైతులు పూర్తిగా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారికి నష్ట పరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్డయర్శి జాఫర్ డిమాండ్ చేశ్యారు. ఈమేరకు సోమవారం కామ్రేడ్ నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలు కురవ డంతో శింగనమల నియోజకవర్గ పరిధిలోని నార్పల, పుట్లూరు, బుక్కరాయ సముద్రం, శింగనమల ప్రాంతంలో అన్ని రకాల పంటలు పూర్తి గా నాశన మయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్లూరు మండలంలో సుమారు 20 కోట్ల రూపాయలు, నార్పల మండల పరిధిలో కోటిన్నర నష్టం జరిగిందని విచారం వ్యక్తం చేశారు. అయితే జరిగిన నష్టం అంచనా వేయడంలో సంబంధిత అదికారులు మీన మేషాలు లెక్కి స్తున్నారని విమర్శించారు. ఈ కా ర్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్డయర్శి చిన్నప్ప యాదవ్, శిం గనమల నియోజకవర్గ కార్య దర్శి నారాయణస్వామి, పుట్లూ రు మండల కార్యదర్శి పెద్దయ్య, రైతు సంఘం శింగనమల నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శిలు, మధు యాదవ్, రాము, చేనేత కార్మిక సంఘం జిల్లా సబ్ కమిటీ సభ్యు డు నేసే మధు, రైతు సంఘం జిల్లా నాయకులు, శివారెడ్డి, అరటి వేముల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

## దళిత ఎమ్మెల్యేపై దాడి అప్రజాస్వామికం - దళితులపై దాడులే టీడీపీ నేతల నైజం - వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎగ్గుల శ్రీనివాసులు

అనంతపురం సిటీ, మార్చి 20 ప్రభాతవార్త

దళితులపై దాడులే టీడీపీ నైజం అని సాక్షాత్తు శాసన సభలో దళిత ఎమ్మెల్యే సుదాకర్ బాబుపై దాడి అప్రజాస్వామికమని వైసీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు ఎగ్గుల శ్రీనివాసులు ఖండిం చారు. జిల్లా వైకాపా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసనస భలోనే దళిత ఎమ్మెల్యే సుధాకర్ బాబుతోపాటు బిసి వర్గానికి చెందిన స్పీకర్ తమ్మినేని సీతారమ్‌పై టిడిపి ఎమ్మెల్యేలు దాడి చేయడం దేశ చరిత్రలోనే బ్లాక్ డేగా నిలుస్తుందన్నారు. టీడీపీ నేతలు చంద్రబాబునాయుడు ఆదేశాలతో చట్టసభల్లో కూడా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఐదేళ్ల టీడీపీ పాలనలో దళితులపై అప్రజాస్వామికంగా దాడులు జరిగాయని, నేడు ప్రతిపక్షంలో ఉన్నా కూడా అదే నైజాన్ని కొనసాగి స్తున్నారని ఆయన విమర్శించారు. దళిత ఎమ్మెల్యేపై దాడి చేసిన టీడీపీ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని శాశ్వితంగా వారిని అసెంబ్లీ నుంచి బహిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.



ఎగ్గుల శ్రీనివాసులు

## ఉరివేసుకుని 'పది' విద్యార్థినీ ఆత్మహత్య

పామిడి, మార్చి 20 ప్రభాతవార్త

ప్రభుత్వ టిసి ఉన్నత పాఠ శాలలో 10వ తరగతి విద్య నభ్య శిస్తున్న షాహీన్ (15) తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన సోమవా రం స్థానిక బిసి కాలనీలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి.. బిసి కాలనీలో నివాసముంటున్న హుసేన్‌బాషా షాహీన దంపతులకు ఇద్దరు కుమార్తె లు ఒక కుమారుడు సంతానం అన్నారు. మృతురాలు షాహీన్ ప్రభుత్వ టిసి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, ఆమె సోదరుడు 8వ తరగతి, సోదరి 5వ తరగతి విద్యనభ్యశిస్తున్నారని తెలిపారు. షాహీన్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతుండేదని ఈక్రమంలో ఆమెకు తల్లిదండ్రులు వైద్యసే వలను అందిస్తున్నారని తెలియజేశారు. బందువులు మృతి చెందటం కారణంగా హుసేన్ బాషా షాహీన ఇరువురూ కలిసి అనంతపురంకు వెళ్ళగా మృతు రాలు షాహీన్ ఆమె సోదరుడు, సోదరి పాఠశాలకు వెళ్ళారని మద్యా హాన్నం సమయంలో షాహీన్ కడుపునొప్పిగా ఉందని ఉపాధ్యాయురాలితో తన తండ్రికి ఫోన్ చేయించి ఇంటికెళ్ళి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్దారి ంచారని మృతురాలి తండ్రి హుసేన్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్టు హెడ్‌కాని స్టేబుల్ లాలూప్రసాద్ వివరించారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్ ఎం, ఉపాధ్యాయ బృందం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని విద్యార్థినీ షాహీన్ మృతదేహాన్ని సందర్శించారు. విద్యార్థినీ షాహీన్ బాగా చదువుతుందని ఆమె అర్ధాంతరంగా తనువు చాలించటం మమ్మల్ని ఎంతగానో కలచి వేసిందన్నారు. విద్యార్థినీ షాహీన్ మృతదేహంపై పడి తల్లిదండ్రులు, బందు వులు రోధించటం పలువుని కంటతడి పెట్టించింది.



ఉరివేసుకుని మృతి చెందిన విద్యార్థినీ షాహీన్

## నారా లో కేష్‌ను కలిసిన దండు శ్రీనివాసులు

శింగనమల, మార్చి 20 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు కలిశారు. సోమవారం కదిరిలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో జోగన్నపేట బహిరంగ సభ స్థలంలో తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను దండు శ్రీని వాసులు కలిశారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీలో చేస్తున్న కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా పరి టాల శ్రీరామ్, నారా లోకేస్‌లు మాటాడుతూ.. రానున్న రోజుల్లో తెలు గుదేశం పార్టీకి యువత చాలా అవసరమని ఇక నుంచి మరింత ఉదృతంగా ప్రజల్లో మమేకమై తిరగాలని యువగళం యాత్రతో మంచి స్పందన వస్తోం దన్నారు. 2024లో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడును గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.



నారా లోకేష్‌తో మాట్లాడుతున్న దండు శ్రీనివాసులు

## ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు గదగ్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరంకు ఎంపిక

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

ఈ నెల 21వ తేది నుంచి 27వ తేది వరకు గదగ్, కర్ణాటకలో జరగనున్న జాతీయ సమైక్యతా శిభిరానికి చెందిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు బిఎస్‌సి తృతీయ సంవత్సరం చదువుతు న్న ఆజాం, జి.నందిత ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏసిఆర్ దివాకర్‌రెడ్డి ఓ ప్రకట నలో తెలిపారు. కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్స హించారు. ఈ కార్యక్రమంలో ఐక్య ఏసి కోఆర్డినేటర్ డా.అచ్చుతానంద, ఎన్ఎస్ఎస్ పిఓలు జయలక్ష్మి, విష్ణుప్రియ, సోమశేఖర్, బాలాజీ నాయక్, గురుమోహన్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ఈశ్వర్‌రెడ్డి, బోటనీ విభాగాధిపతి శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ శశాంక్ మౌలి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

## మూడో రోజు ఇంటర్ పరీక్షలకు 987 మంది గైర్హాజరు

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

ఇంటర్మిడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం ఐదో రోజు జరిగిన పరీక్షలకు 987 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 99 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 32514 మంది విద్యార్థులకుగాను 31527 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన విద్యార్థులు 987 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఓ సురేష్‌బాబు తెలిపారు. పరీక్ష కేంద్రాలను సిట్టింగు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డీఈసీ మెంబర్లు, హైపవర్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి - బిజెపి నేతల డిమాండ్

అనంతపురం సిటీ, మార్చి 20 ప్రభాతవార్త

అకాల వర్షాల వల్ల జిల్లాలో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి కనంపల్లి చిరంజీవిరెడ్డిలు డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల పంట నష్ట పరిహారం జరిగిన పలు ప్రాంతాల్లో సోమవారం బిజెపి నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా రైతులను పరామర్శించి వారు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే జిల్లా అధికారులతో వారు ఫోన్‌లో మాట్లాడి వడగండ్ల వానలు, అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షాలు వడగండ్ల వాన వల్ల పంట చేతికి వచ్చే సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ప్రధానంగా శింగనమల నియోజకవర్గంలో అత్యధికంగా పంటలకు నష్టం చేకూరింద న్నారు. జిల్లా అధికారయంత్రాంగం ప్రతి మండలంలో పర్యటించి నష్టపో యిన ప్రతి రైతును గుర్తించి వారికి నష్ట పరిహారం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో శింగనమల ఇన్‌చార్జ్ రవిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, యువమోర్చ జిల్లా అధ్యక్షులు అశోక్‌రెడ్డి, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముష్టూరు ఆంజినేయులు, ఎస్సీ మోర్చ నాయకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న బిజెపి నేతలు

## ఘనంగా ముగిసిన భాగవత సప్తాహం

అనంతపురం, మార్చి 20 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం పట్టణం అశోక్ నగర్‌లోని శ్రీవివేకానంద పార్కులో సంజీవరెడ్డి నేతృత్వంలో ఈ నెల 13వ తేది నుంచి ప్రారం భమైన భాగవత సప్తాహం పారాయణ, పట్టణ కార్యక్రమం ఘనంగా సోమవారం ముగిసింది. ఉదయం మహిళలు అందరు శ్రద్దగా లలిత సహస్ర పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం, గోవిందనామాలను పాటించారు. అనంతరం 12వ స్కందంలోని శ్లోకాలను అందుకు సంబంధించిన అర్థాలను ఎంతో మంది భాగవతులు శ్రద్దగా పఠించారు. అనంతరం భాగవత సప్తాహ కార్యక్రమం లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భాగవత ప్రియులను సాయిట్రస్టు అధ్యక్షులు వజియసాయికుమార, దత్త రాజమునీంద్ర ఆశ్రమం నిర్వహకులు దత్త మునీంద్ర స్వామి, సంజీవరెడ్డి, బిఎస్ఎన్ఎల్ నాగరాజు, వేణుగోపాల్, నవత విజయకుమార్, విశ్వేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు సత్కరించారు. అనంతరం సాయిట్రస్టు ఆధ్వర యంలో దాదాపు 250 మందికి నారాయణసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయిట్రస్టు అధ్యక్షులు విజయసాయి కుమార్ మాతృమూర్తి రుక్మిణి ఆర్థిక సాయం అందించారు.



భాగవత సప్తాహం కార్యక్రమం

## టీడీపీ ఎమ్మెల్యేలపై వైసీపీ రౌడీల దాడి - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే బ్లాక్‌డే

అనంతపురం అర్బన్, మార్చి 20 ప్రభాతవార్త

విపక్ష తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలపై అధికార వైసీపీ ఎమ్మెల్యేలు గూండాల మాదిరిగా దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం. ప్రజాస్వామ్య దేవాలయం శాసనసభలోనే ఈ దాడి జరిగింది. వైసీపీ ఫ్యాక్షన్ మూకలు అసెంబ్లీలో పాల్పడిన దుశ్చర్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే బ్లాక్‌డేగా మిగిలిపోతుంది. టిడిపికి చెందిన దళిత ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాలవీరాంజినేయ స్వామి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని చంపడానికి వైసీపీ గూండా ఎమ్మెల్యేలు ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికే చికటిరోజు అని టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాస్ పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి సభ్యులు అసెంబ్లీలో శ్యాంతియుతంగా తమ హక్కు అయిన నిరసన తెలుపుతుంటే టీడీపీ వాళ్లు ఒక్కరుంటే మనం ముగ్గురం ఉన్నాం కొట్టండి అంటూ మంత్రి రాంబాబు కేకలు వేయడంతో ఒక్కసారిగా వైసీపీ ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా టీడీపీ ఎమ్మెల్యేలపై దాడికి దిగారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి, భారత రాజ్యాంగంపై దాడి అన్నారు.



మాట్లాడుతున్న టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాస్

## పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

అనంతపురం అర్బన్, మార్చి 20 ప్రభాతవార్త

పార్టీ పటిష్టత కోసం క్లస్టర్లు, అనుబంధ సంఘాలు కృషి చేయాలని మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. సోమవారం తెలుగుదేశంపార్టీ అర్బన్ కార్యాలయంలో అనుబంధ సంఘాలు, క్లస్టర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మన ప్రభుత్వంలోనే అనంత అభివృద్ధి సాధ్యమైం దని, చేసిన అభివృద్ధి గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ కోసం కష్టించి పని చేసే వారికే గుర్తింపు ఉంటుందన్నారు. అనుబంధ సంఘాలు, క్లస్టర్లు పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. అనుబంధ సంఘాలలో ఉండి పార్టీ పటిష్టతకు కృషి చేయకుండా ఉన్న వారిని తొలగించి కొత్త వారిని నియమిస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి

## విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి - విద్యార్థులకు బిసి వెల్ఫేర్ డిడి సూచన

అనంతపురం న్యూటౌన్, మార్చి 20 ప్రభాతవార్త

నగరంలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఉన్న బిసి బాలికల కళాశాల అనంతపురం, అర్బన్ హాస్టల్స్‌ని బిసి వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి తనిఖీ చేశారు. విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ..ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, ఈ అవకాశాలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యానికి చేరుకోవాలని అన్నారు. వార్డెన్లు చెప్పిన విధంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. ఇప్పుడు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మీ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏబిసి డబ్ల్యూఓ సుభాషిని, వార్డెన్లు సుజాత, ఆదిలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డిడి

# మైనార్టీలను నిండా ముంచిన వైకాపా సర్కార్

## - ముస్లిం మైనార్టీల కోసం ఇస్లామిక్ బ్యాంక్ - టిడిపి అధికారంలోకి రాగానే విదేశీ విద్యాదీవెన - గత ప్రభుత్వ పథకాలు తీసేసిన జగన్ - ముస్లిం మైనార్టీల ముఖాముఖి కార్యక్రమంలో నారా లోకేష్


ముస్లిం మైనార్టీలను ఉద్దేశించి మాట్లాడుతున్న నారా లోకేష్


హాజరైన ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన సోదరులు

కదిరి, మార్చి 20 ప్రభాతవార్త

గత సార్వత్రిక ఎన్నికల్లో గంపెడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీలను వైకాపా సర్కార్ అన్ని రకాలుగా నిండా ముంచే సిందని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. సోమవారం రూరల్ మండల పరిధిలోని కవులేపల్లి వద్ద ఉన్న టిబిఆర్ గ్రాండ్‌లో మైనార్టీలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ముందుగా పలువురు ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తి స్థాయిలో వివరించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు జరిగిన అన్యాయాలను వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశా రు. అనంతరం వారిని ఉద్దేశించి నారా లోకేష్ మాట్లాడుతూ.. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామని గుర్తు చేశారు. వైకాపా సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ పథకాలను సైకో ముఖ్యమంత్రి వైఎస్ జగ న్మోహన్‌రెడ్డి తీసేశారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటు చేస్తామన్నారు. విదేశీ విద్యను తీసుకొచ్చి యువత ఉన్నత చదువులకు పూర్తి సహాయ సహకారాలు అందజే స్తామన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను వై0కాపా నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని టిడిపి ప్రభుత్వం రాగానే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి కబ్జా రాయుళ్లపై కఠిన చర్యలు తసీఉకుంటామన్నారు. స్థానిక ఎమ్మెల్యే డా.పివి సిద్దారెడ్డి ఏ రోజూ ముస్లిం మైనార్టీలు ఎదు ర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించిన దాఖలాలు లేవని ఆరో పిం చారు. ఏ ఒక్కరు ఆందోళన చెందాల్సి న అవసరం లేదని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ముస్లిం మైనార్టీ సోతరులు ఎదుర్కొంటున్న సమ స్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కదిరి నియోజక వర్గంలోని ఎక్కువ జనాభా ఉన్న ముస్లిం మైనార్టీలు ఉన్న చోట ఉర్దు పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకా శాలు కల్పించే విధంగా పరిశ్రమలు తీసుకొస్తామని తెలిపారు. ముస్లిం మైనార్టీ సోదరులు వారు ఎదు ర్కొంటున్న సమస్యలను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే కందికుంట, మాజీ ఎమ్మెల్యే అత్తారు చాంద్ బాషా, మైనార్టీ నాయకులు, ముస్లిం మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి నారా లోకేష్‌కు లేదు

## - కదిరి అభివృద్ధిపై చర్చకు సిద్దమా..? - నారా లోకేష్‌కు ఎమ్మెల్యే సిద్దారెడ్డి సవాల్


ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి, మార్చి 20 ప్రభాతవార్త

రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి నారా లోకేష్‌కు లేదని కదిరి ఎమ్మెల్యే డా.పివి సిద్దారెడ్డి పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా కదిరి నియోజకవర్గంలో పర్యటిస్తున్న నారా లోకేష్ ముఖ్యమంత్రిని విమర్శిస్తూ కదిరి అభివృద్ధిపై చేసిన ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. సోమవారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ.. బాబు అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో ఏమి అభివృద్ధి చేసి వెలగబెట్టారో ప్రజలకు చెప్పే దమ్ములేక జగనన్నపై విమర్శలు చేయడం సిగ్గు చేటు అన్నారు. వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సర కాలంలోనే రాష్ట్రాన్ని భవిష్యత్తులో 30 సంవత్స రాల్లో చేపట్టే అభివృద్ధిని చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీ హ యాంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా వాడకున్నారే తప్పా వారిని ఆర్థికంగా, రాజకీయంగా ఏనాడైనా అవకా శం కల్పించారా అని మండి పడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి వర్గంలో అన్ని వర్గాలకు స్థానం కల్పించారన్నారు. గతంలో దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలకు చంద్రబాబు నాయుడు పేర్లు మార్చి కాలం గడుపిన మీరు ముఖ్యమంత్రిని విమర్శించ డమా అంటూ నిలదీశారు. కదిరి అభి వృద్ధిపై తాను చెప్పాల్సి న అవసరం లేదని, ఒకసారి కదిరిలో పర్యటిస్తే అభివృద్ధి ఏంటో మీకళ్లకు కనిపిస్తుందని అన్నారు. బైపాస్ రోడ్డు, కాలేజ్ సర్కిల్ నుంచి చావడి వరకు నాలుగు లైన్ల రహదారి, ప్రతివార్డు, ప్రతి వీధిలో డ్రైనేజీ, రహదారులు వేయించామన్నారు. కదిరి అభివృద్ధిపై చేసిన విమర్శలకు తాను కట్టుబడి ఉన్నానని ఎప్పుడు చెప్పినా తాను చర్చకు సిద్దంగా ఉన్నానని, సమయం, స్థలం చెబితే అక్కడికి రావడానికి సిద్దంగా ఉన్నానంటూ సిద్దారెడ్డి లోకేష్‌పై సవాల్ విసిరారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రిని విమర్శించేది మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# బడుగు బలహీన వర్గాలపై టీడీపీ ఎమ్మెల్యేల దాడి అప్రజా స్వామికం

## -జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ



జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ, మార్చి 20 ప్రభాతవార్త

రాష్ట్ర శాసనసభలో బడుగు బలహీన వర్గాలకు చెందిన స్పీకర్ తమ్మినేని సీతారామ్, దళిత శాసనసభ్యులు సుధాకర్‌బాబుపై దాడి బ్లాక్‌డేగా దేశ చరిత్రలో నిలుస్తుందని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. జిల్లా పరిషత్‌కార్యాలయంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె వలేకర్ల సమావేశ: నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాసనసభలో అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌పైనే టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేసేందుకు యత్నించడం, దానని అడుడకునేందుకు యత్నించిన దళిత శాసన సభ్యుడు సుధాకర్‌బాబుపై దాడి చేయడం దుర్మర్గకరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల్లో చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించి గుర్తింపును ఇస్తుంటే ఓర్వలేని టిడిపి నేతలు వారిపై దాడులు చేస్తూ తమ నీచ చరిత్రను చాటుకుంటున్నారన్నారు. శాసనభలో దుర్మ ర్గకరంగా వ్యవహరిం చిన టీడీపీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు కూడా టీడీపీ నేతల దౌర్జన్యాలను గుర్తించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.

# పాత పనులకే బిల్లులా..!

## - ప్రతి సారి తూతూ మంత్రంగానే సామాజిక తనిఖీ - ఆసరాగా చేసుకుంటున్న సిబ్బంది.. లక్షల్లో గోల్‌మాల్ జరిగినా తేల్చేది రెండు వేలు.. ఐదేవేలే..! - 15కి పైగా సామాజిక తనిఖీలు జరిగినా అవినీతిని తేల్చలేదే..! - ముగ్గురు పని చేస్తే.. 30 మందికి బిల్లులు

అగళి, మార్చి 20 ప్రభాతవార్త

ప్రభుత్వం వలసలను ఆపి కూలీలకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. అంటే కూలీలకు పని కల్పించడం దీని అర్థం. కానీ చేయని పనులకు బిల్లులు చేయడం వీరి అర్థం. ప్రతి సంవత్సరం జరిగిన పనులపై సామాజిక తనిఖీ జరుగుతుంది. జరిగిన అవినీతి అవకతవకలను బహిర్గతం చేసిచర్యలు తీసుకోవాలి కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ దాదాపు 15 సార్లు సామాజిక తనిఖీ జరిగింద ఇకానీ లక్షల్లో అవినీతి గోల్‌మాల్ జరిగినా దానిపై చర్యలు తీసుకోవడం లేదు. వచ్చిన తనిఖీ బృందం కూడా తూతూ మంత్రంగా రిపోట్లను పరిశీలించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో ఎంపిపి రేణుకా కామరాజు, పాత పనులకు బిల్లులు చేసుకుంటున్నారని, పనులు లేకుండా మస్టర్లు వేస్తున్నారని, గంటపాటు ఉపాధిహామీపై సాక్షాత్తు సమావేశంలోనే తెలిపినాఇంత వరకు దానిపై చర్యలు లేవు. 2021-22 సంవత్స రానికి గాను 7.31 కోట్ల రూపాయల విలువైన పనులు జరిగాయి. ఆ పనులపై మండలంలో సామా జిక తనిఖీ మొదలైంది. ప్రతి సంవత్స రం ఐదు నుంచి 10 కోట్ల రూపా యలను ఉపాధిహామీలో మట్టి పనుల కోసం ఖర్చు పెట్టారు. లక్షల్లో గోల్ మాల్ జరిగినా వందల్లో రికవరీ, ఒక్కరిపైన కూడా ఇంత వరకు చర్యలు తీసుకోలేదని మండల ప్రజలు అంటున్నారు. కోడిపల్లి పంచాయితీలో ప్రస్తు తం సామాజిక తనిఖీ జరుగుతోంది. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలి కానీ పని కల్పించడానికే అధికారులు లంచం తీసుకుంటున్నారని మంజు నాథ్, నరసింహరాజు, గంగప్ప, రంగప్ప, నాగరాజు, నవీన్ తదితరులు తెలిపారు. హనుమక్క అనే ఆమెకు పని అడిగినా ఇవ్వలేదని ఆమె వాపోయింది. గత రెండు సంవత్స రాల క్రితం రొళ్ల-జంగమరపల్లి సమీపంలో చేసిన పనులకు మళ్లీ బిల్లులు పెట్టారని మంజునాథ్, నరసింహరాజు, రంగప్ప, గంగప్ప, నాగరాజు, మంజునాథ్, నవీన్‌లు తెలిపారు. మండలంలో ప్రతి పంచాయితీలోనూ ఇదే తంతు. పాత పనులకు బిల్లులు చేసుకోవడం, పాత పనిని అరకొరగా చేసి బిల్లులు చేసుకోవడం, కర్ణాటక ప్రాంతంలో ఉన్న వారిని కూలీకి తీసుకురావడం ఎక్కడో ఉన్న వారు పని చేసినట్లుచూపించి ఏటిఎం ద్వారా బిల్లులు డ్రా చేసుకుని స్వాహా చేస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. కోడి పల్లిలో ముగ్గురు పని చేస్తే 30 మందికి బిల్లులు చేస్తున్నట్లు మంజునాథ్, నరసింహరాజు, గంగప్ప తెలిపారు. మండల వ్యాప్త ంగా ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతు న్నాయని ఆరో పణలు ఉన్నాయి . ప్రతి సారి ఓపన్ ఫోరం సమయంలో సామాజిక తనిఖీ ల్లో ఏమి అవినీతి తేల్చకుండానే ముక్త సరిగా ముగిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. కూలీల కోసం పనులు కల్పిస్తే ఎక్కడో బెంగుళూరు, మైసూరు, తుమకూరు లాంటి ప్రాంతంలో ఉన్న వారు పని చేసినట్లు మస్టర్లు వేసి ఏటిఎం ద్వారా బిల్లులు డ్రా చేసుకుంటున్నారని ఇది ప్రతి ఏడు ఉపాధిహామీ కోసం కోట్లలో ఖర్చు పెట్టి లక్షల్లో గోల్‌మాల్ జరుగుతున్నా సంబంధిత సిబ్బందిపై సంబంధిత అధికారులపై చర్యలు కానరవడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున ఆనరు. ఇప్పటికే మండలంలో సామాజిక తనిఖీ మొదలైంది. చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి మండల వ్యాప్తంగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అవకతవకలను అవినీతిని సహించలేకే మండల సర్వ సభ్య సమావేశంలో ఎంపిపి రేణుకా కామరాజు గంటల కొద్ది దీనిపై ప్రసంగించి లక్షల్లో గోల్‌మాల్ జరిగిందని, చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేసినా ఇంత వరకు చర్యలే లేవు. సామాజిక తనిఖీ ప్రతి సంవత్స రం జరుగుతున్నా ఒక్క ఏడాది కూడా ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని మండల ప్రజలు చర్చిం చుకుంటున్నారు. ఫారం పాండ్లు, భౌండరీ ట్రెంచులు, అవెన్యూ ప్లాంటేషన్, మొక్కల పెంపకం, హార్టికల్చర్ లాంటి పనులను ఇందులో చేస్తారు. చేసిన పనులనే మళ్లీ చేసినట్లు చూపించడం ఎంత వరకు సమంజసమని మంజునాథ్ తదితరులు ప్రశ్నిస్తున్నారు. కోడిపల్లి పంచాయితీలో పాత పనులకే బిల్లులు చేశారని వారిపైచర్యలు తీసుకోవాలని మంజునాథ్ డిమాండ్ చేశారు.

# పదునైన కవిత్వ చిరునామా డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్

## - ఉగాది జాతీయ పురస్కారంతో సత్కరించిన సిబిఐ పూర్వ జెడి లక్ష్మీనారాయణ


ఉద్దండం చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ తదితరులు

అనంతపురం, మార్చి 20 ప్రభాతవార్త బ్యూరో

సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు చేస్తున్న యువ కవి డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ పదునైన కవిత్వానికి చిరునామా అని సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ ప్రశంసించారు. కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో బెంగుళూరులోని కళ్యాణ్ నగర్ ఇండో ఏషియన్ విద్యా సంస్థల సెమినార్ హాలులో శోభకతు నామ ఉగాది జాతీయ పురస్కారాల ప్రధానోత్స వ సంభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన యువ కవి తెలుగు పరిశోధకుడు డా.ఉద్దండం చంద్రశేఖర్‌ను ఉగాది జాతీయ పురస్కారం-2023 ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ జెడి మాట్లాడుతూ.. వెన్నెల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 100 సాహితీ సభలు నిర్వహించి చంద్రశేఖర్ సామాజిక చైతన్యం పెంపొందించ డంలో విశేష కృషి చేశారన్నారు. మహా మనిషి పుస్తకం మనుషుల్లో మానవ త్వాన్ని మేల్కొల్పే రచన అని కొనియాడారు. కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య చైర్మన్ బి.మాల్యాద్రి సభకు అధ్యక్షత వహించారు. ఇండో ఏషియన్ విద్యా సంస్థల అధినేత ప్రొఫెసర్ ఏకాంబరం నాయుడు, బెంగుళూరు విశ్వ విద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షురాలు ఆచార్య కొలకలూరి ఆశా జ్యోతి, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కళ్లె వెంకటేశ్వర శాస్త్రి, అధ్యక్షులు వెంకట చండీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో టిడిపి దళిత ఎమ్మెల్యేపై వైసిపి ఎమ్మెల్యేలు దాడి అమానుషం

## - ముఖ్యమంత్రి జగన్ దళితులకు వెంటనే క్షమాపణ చెప్పాలి - మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి


పల్లె రఘునాథరెడ్డి

అనంతపురం, మార్చి 20 ప్రభాతవార్త బ్యూరో

శాసనభలో ఎమ్మెల్యేలు డోలా బాల వీరాంజినేయ స్వామి, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలపై జరిగిన దాడిని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తీవ్రంగా ఖండించారు. శాసనసభను ముఖ్యమంత్రి కౌరవ సభగా మార్చారంటూ ఎద్దేవా చేశారు. శాసనసభలో తెలుగుదేశం పార్టీకి చెందిన డోలా బాల వీరాంజినేయస్వామి, సీనియర్ శాసనభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిలపై వైకా పా ఎమ్మెల్యేలు దాడి చేయడం సిగ్గుమాలిన చర్యగా మాజీ మంత్రి పల్లె రఘునాతరెడ్డి అభివర్ణించారు. రాష్ట్రాన్ని ఎటువైపు తీసుకె ళ్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సభ్య సమాజం తలదించుకునే గౌరవ శాసనసభ్యులపై అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు దాడి చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎంతో హుందాగా ఉండ వలసిన శాసనసభను చివరకు కౌరవ సభగా మార్చారన్నారు. శాసనసభ్యులపై దాడి జ రుగుతుంటే ముఖ్యమంత్రి వెకిలి నవ్వులు నవ్వుతున్నారని పల్లె విమర్శించారు. దళిత ఎమ్మెల్యే అని చూడకుండా దాడి చేయడం దారుణం అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెంపపెట్టులా వైసీపీకి ఓటర్లు గుణపాఠం చెప్పిన వారి మార్పు రావడం లేదన్నారు. ఇప్పుడైనా వైసీపీ ఎమ్మెల్యేల తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

# హత్య నేరం రుజువు కావడంతో ఒకరికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష

## - 7వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ స్థానం, ఫ్యామిలీ కోర్టు సంచలన తీర్పు - దర్యాప్తు అధికారి, ఏపిపి, కోర్టు కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 20 ప్రభాతవార్త

శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన నారాయణస్వామిని అతి కిరాతకంగా హత్య చేసిన నేరంరుజువు కావడంతో అదే గ్రామానికి చెందిన పట్రా రామగోపాల్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ 7వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి.తిరుమల రావు సోమవారం సంచలన తీర్పు వెలువరించారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే.. శింగనమలమండలం కల్లు మడి గ్రామానికి చెందిన నారాయణ స్వామిని అదే గ్రామానికి చెందిన పట్రా రాంగోపాల్ విచక్షణా రహితంగా నరికి చంపాడు. 2021 ఫిబ్రవరి 2వ తేదిన జరిగిన ఈ హత్యపై శింగనమల పోలీస్ స్టేషన్‌క్రైం నెంబర్ 35/2021 యు/ఎస్ 302 కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ విజయభాస్కర్ గౌడ్ కేసు విచారించి న్యాయ స్థానంలో ముద్దాయిపై చార్జి షీటు దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజుబాబు (బాబ్జీ) ప్రాసిక్యూషన్ తరుపున 13 మంది సాక్షులను పిసి 422 సంకన్న సహాయంతో విచారించారు. అనంతరం న్యాయమూర్తి ఇరు వర్గాల వాదనలు, కేసు పూర్వపరాలు పరిశీలించి పట్రా రాంగోపాల్‌పై హత్య నేరం రుజువు కావడంతో ముద్దాయికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ సంచలన తీర్పు చెప్పారు. ఒక్కో సిఐకు ఒక్కో కీలక కేసును అప్పగించి నింధితులకు శిక్షపడేలా మానిటరింగ్ చేయాలని శింగన మల సిఐ అస్సార్ బాషాను జిల్లా ఎస్పీ డాక్టర్ పక్కీరప్ప పురమాయించారు.

# నేడు ప్రారంభం కానున్న రాగిజావ పంపిణీ కార్యక్రమం

## - ఏర్పాట్ల పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

కొత్తచెరువు, మార్చి 20, ప్రభాతవార్త

మండల కేంద్రమైన కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు మగళవారం జగనన్న గోరుముద్ద పథకానికి అనుసంధానంగా శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ డిఇఒ మీనాక్షితోపాటు సోమవారం సాయంత్రం పాఠశాలను సందర్శించి మంగళవారం రాగిజావ ప్రారంభోత్స వ కార్యక్రమానికి చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ ప్రారంభోత్స వ కార్యక్రమానికి శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, పుట్టపర్తి శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు మేజర్ పంచాయతీసర్పంచ్ రాధ, ఎంపిపి గాయత్రి, జడ్పిటిసి గంగాదేవిలతో పాటు పలువురు హాజరు కాను న్నారు. జిల్లా వ్యాప్తంగా 2,034 పాఠశాలలకుగాను 1,46,774 మంది విద్యార్థులకు జగనన్న గోరుముద్ద మెనూతో పాటు ఈ రాగి జావను పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి చర్చిస్తారని, ఇందు కోసం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాల్సిందిగా అధికారు లను ఆదేశించారు. పాఠశాల హాజరు శాతం పెంచడం, డ్రాప్ ఔట్‌లను తగ్గించడం, విద్యార్థుల ఆకలి తీర్చడం, పౌష్టికమైన రుచికరమైన భోజనం అందించమే లక్ష్యంగా ఈ రాగిజావ పంపిణీ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు కలెక్టర్ పేర్కొ న్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎక్కవ పౌష్టికా హారం అందించడం కోసం వారంలో మూడు రోజులు అనగా, మంగళవారం, గురువారం, శనివారం రాగిజావ పం పిణీ కార్యక్రమంలో అమలు చేయ డం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో రక్తహీన త లోపాన్ని తగ్గించడానికి ప్రధాన పౌష్టికారం పంపిణీ కొరకు ప్రభుత్వం పౌరసరఫరాల శాఖను అనుసంధానించి ఎఫ్‌పి షాపుల ద్వారా పాఠశాలలకు విద్యార్థుల సం ఖ్య కు అనుగుణంగా 5 కెజీలు, 1 కెజి పాకెట్ల చొప్పున రాగి, బెల్లం పొడులను సరఫరా చేయడం జరుగుతుం దన్నారు. 5 కెజిల పాకెట్లను 1390 పాఠశాలలకు, 1 కెజీ పాకెట్లను 641 పాకెట్లను ఇప్పటికే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానో పాధ్యాయురాలు మాధవిలత, పర్యవేక్షణ అధికారులు ఎడి-1 నాగరాజు, ఎడి-2 రామకృష్ణ, సంబంధిత అధికారలు పాల్గొన్నారు.

# అకుంఠిత దీక్షతో చరిత్ర తిరగరాసేలా యువగళం పాదయాత్ర విజయవంతం చేద్దాం

## - టిడిపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, మహిళామణులు యువగళంలో భాగస్వామ్యులు కావాలి - ఉద్వేగభరితంగా పిలుపునిచ్చిన పల్లె


బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్లె

ఓబుళదేవరచెరువు, మార్చి 20, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్రతో టిడిపికి పూర్వవైభవం తీసుకువచ్చి తెలుగుదేశం కుటుంబ సభ్యులకు ఊపిరిపోసి తెలుగుదేశం జెండాను విజయతీరాలకు చేర్చడానికి తరలివస్తున్న నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి పిలుపుని చ్చారు. ఈ సందర్భంలో స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర నేడు(మంగళవారం) పుట్టపర్తి వర్గం పులం గంపల్లిలోకి ప్రవేశిస్తుందన్నారు. ఈ అఖండమైన పాదయాత్రకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళామణులు, కుటుంభసభ్యులు, భాగస్వాములై లోకేష్ వెన్నంటే ఉండాలన్నారు. అకుంటిత దీక్షతో చరిత్ర తిరగ రాసేలా ప్రతి అడుగుకు అకుంటిత దీక్షతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్రం లో కనీవిని ఎరుగని రీతిలో లోకేష్‌బాబు చేస్తున్న పాదయాత్రకు అపూర్వ ఆదరణ జనప్రవాహం, జనాధరణ, జననీరాజనంతో ప్రతి పక్ష పార్టీలో గుండెలు గుబేల్ అయ్యే ్యలా పాదయాత్ర సాగుతోందన్నారు. కావున తమ వంతు బాధ్యతగా ప్రతి టిడిపి కార్యకర్త సైనికుల్లా పనిచేసి లోకేష్‌బాబు పాదయాత్ర విజయవంతం చేయడానికి నడుంబిగించాలని పల్లె పిలుపునిచ్చారు. ఇదే సందర్భంలో మండలంలోని వేమారెడ్డిపల్లి వద్ద ఉగాది పండుగ అనంతరం పున:ప్రారంభమయ్యే లోకేష్ పాదయాత్రలో భాగంగా బహిరంగ సభ వేదిక, విడిది ప్రాంతాలను ఆయన స్వయంగా పరిశీలించారు. అక్కడ పనుల్లో ఎలాంటి లోటుపాట్లు జరగకూడదని సిబ్బందికి సూచించారు. పల్లె వెంట కన్వీనర్ జయ చంద్ర, ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు రాజారెడ్డి, బడిశం రామాంజినేయులు, డాక్టర్ జాకీర్, కొండే ఈశ్వరయ్య, జెరిపిటి అంజినప్ప, ప్రసాద్, జయచంద్రారెడ్డి, దారా నాగేంద్ర, రమేష్, ఆంజినేయులు, ప్రభాకర్‌రెడ్డి, గంటా శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# మీ కృషి అభినందనీయం

## - జాతీయ అధ్యక్షులునారా చంద్రబాబునాయుడు


చంద్రబాబునాయుడుతో ద్వి సభ్య కమిటీ సభ్యులు ముంటి మడుగు కేశవరెడ్డి ఆలం నరసనాయుడు

గార్లదిన్నె, మార్చి 20 ప్రభాతవార్త

గార్లదిన్నె మండలం తెలుగుదేశం పార్టీ శింగనమల నియోజకవర్గం ద్వి సభ్య కమిటీ సభ్యులు ముంటి మడుగు కేశవరెడ్డి ఆలం నరసనాయుడులను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అమరావతి తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి రావాలనిపిలుపు నివ్వడంతో అక్కడికి చేరుకున్నటువంటి నాయకులను మీ కృషికి అభినందనలు తెలియజేశారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలోల గెలుపు కొరకు మీ కృషికి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధిని గెలుపొందడం కొరకు క్లస్టర్ ఆధ్వర య్యంలో ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో నియోజకవర్గ ఐటిడిపి ఆధ్వర యంలో అన్ని కార్యక్రమాలలో ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ గెలుపునకు మరింత సమిష్టి కృషి చేయాలన్నారు. అలాగే నూతనంగా ఎన్నికైనటువంటి ఎ మ్మెల్సీ భూమిరెడ్డి రాంగపాల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తు తెలుగుదేశంపార్టీ కార్యచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

